ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 22 సెప్టెంబరు 2025



నేటి అలంకారం
బాలా త్రిపుర సుందరీ దేవి



రథం సెంటర్‌లో ప్రత్యేక ఎఫ్‌వోబీ

వినాయకుడి ఆలయం, కుమర్నిపాలెం వైపు నుంచి క్యూల్లోకి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం పూర్తయిన తర్వాత శివాలయం వైపున ఉన్న మెట్ల ద్వారా కిందికి దిగుతారు. వాళ్లంతా కనకదుర్గనగర్‌లోకి వచ్చి ప్రసాదాలను కొనుగోలు చేసి రహదారి మీదకు వస్తారు. ఇలా వచ్చిన భక్తుల్లో చాలా మంది కాళేశ్వరరావు మార్కెట్ వైపునకు వెళ్తారు. మరికొంతమంది కెనాల్ రోడ్డులోకి వెళ్తారు. కుమ్మరిపాలెం వైపున వాహనాలను పార్క్ చేసిన భక్తులు అక్కడికి వెళ్లాలంటే కిలోమీటరు దూరంలో ఉన్న వినాయకుడి ఆలయం వద్దకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాలి. భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఈసారి రథం సెంటర్ వద్ద క్యూలైన్ల పై భాగం నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. కుమ్మరిపాలెం వైపునకు వెళ్లే భక్తులు రహదారి దాటడానికి క్యూలైన్లు అడ్డుగా ఉన్నా ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి కెనాల్ రోడ్డులోకి వెళ్లవచ్చు.



ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి శరన్నవరాత్రి మహోత్సవాలకు వేళయ్యింది. తొలిరోజు కనకదుర్గమ్మ శ్రీబాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. దర్శనాల్లో ఇబ్బందులు తలెత్తకుండా 500 దర్శన టికెట్లు రద్దు చేసి, రూ.300, రూ.100, ఉచిత క్యూలు మాత్రమే ఈ సారి అమలు చేస్తున్నారు. ఆరు వేల మంది పోలీసులు, 500 కెమెరాలతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాయి.

సంబరం నేడే

ఉదయం 8.30 గంటలకు దుర్గమ్మ తొలి దర్శనం



- శ్రీబాలాత్రిపురసుందరిగా అలంకారం
- వీఐపీలకు 7-9, 3-5 గంటలకు దర్శనాలు
- ఆలయంలో, అన్నదానం వద్ద హెడ్‌కౌంట్ కెమెరాలు
- దసరా విధుల్లో చేరిన పోలీసులు
- పారిశుధ్య పనులకు 1400 మంది కార్మికులు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీపీ రాజశేఖరబాబు దంపతులు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి శరన్నవరాత్రి మహోత్సవాల ఆరంభానికి సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో తొలి అలంకారంతో కనకదుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై 11 రోజులపాటు శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. తొలి రోజున అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటల మధ్యలో అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత తొలి దర్శనం చేసుకుంటారు. శరన్నవరాత్రుల్లో తొలి రోజున ఇంద్రకీలాద్రిపై రెండు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించనున్నారు. శివాలయానికి వెళ్లే మార్గంలో దాతల సహకారంతో నిర్మించిన నిత్యపూజల మందిరం, రెండో యాగశాలను మంత్రులు ప్రారంభిస్తారు. వీఐపీ కేటగిరిలో వచ్చే వారికి ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల్లో సమయాలను కేటాయించారు. ఆ సమయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉంటున్న నేపథ్యంలో అధికారులు

మిగతా 6లో..

విధుల్లోకి భారీగా సిబ్బంది

ఇంద్రకీలాద్రిపై 11 రోజులపాటు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వర్తించేందుకు ఆయా శాఖలు రాష్ట్రం నలుమూలల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చాయి. దేవదాయ శాఖలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న 500 మంది అధికారులు, సిబ్బందికి ఇంద్రకీలాద్రిపై అధికారులు విధులు కేటాయించారు. ఇంద్రకీలాద్రి పై నుంచి భక్తులు సంచరించే అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణకు 1400 మంది కార్మికులను వీఎంసీ నియమించింది. వాళ్లంతా మూడు షిప్టుల్లో విధులు నిర్వర్తిస్తారు. బందోబస్తు కోసం పోలీసు అధికారులు మొత్తం ఆరు వేల మంది అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపారు. ఇందులో ఐదు వేల మంది పోలీసులు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వారు కాగా మిగిలిన 1000 మందిని ఇతర జిల్లాల నుంచి తీసుకొచ్చారు. బందోబస్తు విధులకు వచ్చిన వారికి ఆదివారం సాయంత్రం డ్యూటీ పాయింట్లు కేటాయించారు.



హత్యకు గురైన సత్యనారాయణ

యువకుడి దారుణ హత్య

మద్యం దుకాణంలో యువకుల మధ్య గొడవ

- ఆపేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై సీసాతో దాడి
- తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి
- బందరు రోడ్డులో ఘటన.. పోలీసుల అదుపులో నిందితులు
- మృతుడు యనమలకుదురు వాసి

పెనమలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గొడవకు దిగి, యువకుడిని బీరు సీసాతో తలపై మోది హత్య చేసిన ఘటన బందరు రోడ్డులోని వెలగపూడి కోల్డ్ స్టోరేజి ఆవరణలోని మద్యం దుకాణం వద్ద జరిగింది. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. యనమలకుదురుకు చెందిన అవనిగడ్డ సత్యనారాయణ(34) తన స్నేహితుడు నాగరాజుతో కలిసి ఎస్‌ఎల్‌టీ వైన్‌షాపు వద్దకు మద్యం తాగేందుకు శనివారం సాయంత్రం వెళ్లాడు. అక్కడికి కాసేపయిన తర్వాత సత్యనారాయణకు పరిచయస్థులయిన అయ్యప్ప, భవానీ శంకర్ మద్యం తాగేందుకు వచ్చారు. వారితో సత్యనారాయణతో వచ్చిన నాగరాజుకు గొడవ జరిగింది. దీంతో గొడవను ఆపడానికి వెళ్లిన సత్యనారాయణ తలపై భవానీ శంకర్ బీరు సీసాతో బలంగా మోదాడు. దీంతో సత్యనారాయణ స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టు పక్కలవారు వెంటనే సత్యనారాయణను దగ్గర్లోని విజయ ఆస్పత్రికి తరలించగా, అక్కడ సత్యనారాయణను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అప్రమత్తమయిన పెనమలూరు పోలీసులు నిందితులను వెతికి పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. నిందితులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు. హత్యకు గల కారణాలను పోలీసులు సేకరించే పనిలో ఉన్నారు.

అవినీతి వెలుగు!

వివాదాలమయంగా మచిలీపట్నం వెలుగు కార్యాలయం

- ఆడిట్ పేరుతో గ్రామైక్య సంఘాల నుంచి నగదు వసూలు
- నకిలీ డ్వాక్రా సంఘాలు సృష్టించి బ్యాంకుల నుంచి రుణాలు
- గత జనవరి నుంచి భర్తీకి నోచుకోని ఏపీఎం పోస్టు
- అంతాతానై వ్యవహరిస్తున్న సీసీపై పలు ఆరోపణలు

మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయం వివాదాలమయంగా తయారైంది. ఆడిట్ పేరుతో గ్రామైక్య సంఘాల నుంచి భారీగా నగదు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ అవినీతి వ్యవహారాలు కొనసాగించేందుకు నెలల తరబడి ఏపీఎం పోస్టును భర్తీ చేయకుండా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతా తానై వ్యవహరిస్తున్న ఓ సీసీకి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టేందుకు డీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నించగా, ఉన్నతాధికారులు మొట్టికాయలు వేయడంతో వెనక్కి తగ్గారని సమాచారం. ఇక్కడకు మరెవరూ రాకుండా చక్రం తిప్పుతున్నారని తెలిసింది.



మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలంలో 76 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1700లకుపైగా డ్వాక్రా సంఘాలున్నాయి. ఏపీఎం కార్యాలయంలో ఐదుగురు సీసీలు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం) పోస్టు కూడా నెలల తరబడి ఖళీగా ఉంది. పదిహేను రోజుల క్రితం మచిలీపట్నం మండలంలోని గ్రామైక్య సంఘాలకు సంబంధించి ఆడిట్ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఆడిట్‌లో తొలిరోజు మధ్యాహ్నం ఒంటి గంటలోపు 20 గ్రామైక్య సంఘాలక సంబంధించిన ఆడిట్‌ను ముగ్గురు అధికారులు పూర్తి చేశారు. తెరవెనుక ఏం జరిగిందో గానీ రెండోరోజు నాటికి 76 గ్రామైక్య సంఘాల ఆడిట్‌ను హడావిడిగా అధికారులతో పూర్తి చేయించారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో డీఆర్‌డీఏ అధికారుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. వేరే మండలంలో పనిచేస్తున్నట్లుగా చూపుతున్న ఒక సీసీ (కమ్యూనిటీ కోఆర్డినేటర్) ఆడిట్ అధికారులకు ఇవ్వాలని చెప్పి రూ.వెయ్యి నుంచి రూ.1600 చొప్పున నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఆడిట్ త్వరితగతిన పూర్తిచేసి వెళ్లిపోయేలా డీఆర్‌డీఏ కార్యాలయంలోని ఒక అధికారి, సీసీ తెరవెనుక చక్రం తిప్పారని డీఆర్‌డీఏ కార్యాలయ అధికారులే చెప్పుకుంటున్నారు.

నకిలీ డ్వాక్రా సంఘాలకు నగదును మళ్లించేశారా!

మచిలీపట్నం మండలంలో 1700లకుపైగా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వాటిలో 100 వరకు నకిలీ డ్వాక్రా సంఘాలున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయంలో అన్నీ తానై చక్రం తిప్పే ఒక సీసీ కనుసన్నల్లో ఈ నకిలీ డ్వాక్రా సంఘాలున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ డ్వాక్రా సంఘాల పేరుతో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను తమ బంధువుల ఖాతాలకు ఈ ఏడాది మార్చికి ముందే ఈ సీసీ మళ్లించారని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని మండలంలో పనిచేసే పలువురు సీసీలు చెప్పుకుంటున్నారు. చిట్టిపాలెంలో అధిక మొత్తంలో నకిలీ డ్వాక్రా సంఘాలున్నాయని, అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని సీసీలు అంటున్నారు.

ఏపీఎంను నియమించకుండా జాప్యం!

మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎంను నియమించకుండా డీఆర్‌డీఏ అధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రెండు విడతల్లో జిల్లాలో ఏపీఎంలకు బదిలీలు జరిగాయి. రెండు విడతల్లోనూ మచిలీపట్నం మండలం వెలుగు కార్యాలయానికి ఏపీఎంను నియమించకుండా పక్కనపెట్టేశారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఈ మండలంలో పని చేసేందుకు ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదని డీఆర్‌డీఏ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారని సమాచారం. ఇక్కడ పనిచేసే సీసీ ఒకరు సరైన విద్యార్హతలు లేకున్నా ఏపీఎం పోస్టును తనకు ఇవ్వాలని తెరవెనుక ప్రయత్నాలు చేసింది. అధికారులు ఈ ప్రతిపాదనను సెర్ప్ కార్యాలయానికి రెండు విడతలుగా పంపారు. దీన్ని సెర్ప్ అధికారులు తిరస్కరించి ఈ ఫైల్‌ను వెనక్కి పంపారు. అయినా డీఆర్‌డీఏ అధికారులు ఈ సీసీని ఇన్‌చార్జి ఏపీఎంగా నియమిస్తూ ఇటీవల కాలంలో ఉత్తర్వులు జారీ చేశారు. వివాదాస్పదమైన ఈ సీసీని ఇన్‌చార్జి ఏపీఎం పోస్టులో ఎలా నియమిస్తారంటూ టీడీపీకి చెందిన మండల స్థాయి క్లస్టర్ ఇన్‌చార్జీలు ప్రశ్నించడంతో ఈ ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు. సదరు సీసీ వ్యవహార శైలి వివాదాస్పదంగా ఉండటంతో పాటు, క్లస్టర్ ఇన్‌చార్జీల నుంచి ఒత్తిడి రావడంతో ఆమెను పెడన మండలానికి జూన్‌లో బదిలీ

మిగతా 6లో..

మచిలీపట్నంలో రోడ్డుపై నిలిచిన నీరు



జిల్లాలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

మచిలీపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులు వీచాయి. ఉదయం 8.30 గంటల వరకు ఉంగుటూరు మండలంలో అత్యధికంగా 96.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అవనిగడ్డలో 2.2 మిల్లీమీటర్లు వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 26.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది. పెనమలూరులో 92.2 మిల్లీమీటర్లు, బంటుమిల్లిలో 72.2, కంకిపాడులో 48.4, బాపులపాడులో 41.6 మిల్లీమీటర్లు పడింది. మిగిలిన మండలాల్లో 30 మిల్లీమీటర్ల కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం వరిపైరుకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. కోస్తాతీరం వెంబడి ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరించింది.

నేడు ఎగ్జిబిషన్ ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): విజయవాడ ఉత్సవ్-2025లో భాగంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని దేవస్థానం భూమిలో నిర్వహించనున్న విజయవాడ ఎక్స్‌పో (ఎగ్జిబిషన్) ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుష్కర కాలం తర్వాత సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్‌ను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉదయం తొమ్మిది గంటలకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. వినోద కార్యక్రమాలతో పాటు విద్యా, వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ తదితర అన్ని రంగాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం మిస్ మానస వారణాసి ప్రదర్శన, టాలీవుడ్ మిక్స్ మెడ్లీ ప్రదర్శన, సంగీత దర్శకుడు మణిశర్మ లైవ్ షో, 23న బాలీవుడ్ మిక్స్ మెడ్లీ ప్రదర్శన, మాస్ మెడ్లీ బీట్స్, ఆర్పీ పట్నాయక్ లైవ్, 24న కామాక్షి బృందం వయోలిన్ ప్రదర్శన, కార్తిక్ లైవ్, 25న మిస్ విజయవాడ, 26న తేజెస్ స్కేటింగ్, గిన్నిస్ రికార్డ్, వినోదాత్మక మెడ్లీ ప్రదర్శన, థైక్కుడం బ్రిడ్జ్ లైవ్, 27న వినోదాత్మక మెడ్లీ ప్రదర్శన, చెర్రి డ్రమ్స్ ప్రదర్శన, సింగర్ సునీత లైవ్, 28న బీట్‌బాక్స్ ప్రదర్శన, రామ్ మిరియాల లైవ్, 29న వినోదాత్మక మెడ్లీ ప్రదర్శన, విజయవాడ ఐడియల్, 30న ఫ్లూట్ ప్రదర్శన, క్యాప్రిచ్చియో, అక్టోబరు 1న కలారీ ప్రదర్శన, గీతా మాధురి లైవ్, అక్టోబరు 2న వినోద కార్యక్రమాలు, జామ్ జంక్షన్ లైవ్ షోలు ఉంటాయి.



భక్తుడి చేతిలో దసరా దివ్యదర్శిని

- యాప్‌లో దుర్గగుడి సమగ్ర సమాచారం
- భక్తులకు సులువుగా అమ్మవారి దర్శనం
- అన్ని వివరాలు యాప్‌లోనే నిక్షిప్తం

6

భక్తులకు మంచి ఆతిథ్యం ఇవ్వండి

- దసరా ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు
- ధరలు పెంచవద్దని ఆటో, ట్యాక్సీదారులకు హెచ్చరికలు
- ఆహార ధరలు పెంచవద్దని హోటల్స్, ఫుడ్‌కోర్టులకు ఆదేశాలు
- వాణిజ్య దుకాణాలను అందంగా అలంకరించాలని సూచన
- నగర ప్రజలకు ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

భక్తులకు మంచి ఆతిథ్యం ఇవ్వండి

భక్తుడి చేతిలో దసరా దివ్యదర్శిని యాప్



ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలు ఈనెల 22న సోమవారం నుంచి 11 రోజులపాటు జరగనున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని అంచనా. గత ఏడాది 13.5 లక్షల మంది రాగా, ఈసారి 20 లక్షల మంది వస్తారని అధికారుల అంచనా. ఇంత పెద్ద ఎత్తున జరిగే దసరా మహోత్సవాలకు సంబంధించి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారు. వీరందరికీ దుర్గగుడిలో జరిగే పూజలు, ఏర్పాట్లు, దర్శనానికి ఎలా వెళ్లాలి, తదితర అంశాల అన్నింటి అవగాహన కల్పించేలా యాప్‌ను రూపొందించింది. అమరావతి సాఫ్ట్‌వేర్ సంస్థ ఈ యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నవారందరి చేతుల్లోకి వెళ్లింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే దుర్గగుడిలో జరిగే అన్ని అంశాలు ఇట్టే తెలిసిపోతాయి. యాప్‌లో దుర్గామల్లేశ్వరుల ఆవిర్భావం, దుర్గమ్మవిశిష్టత అందులో పొందుపరిచారు. తొలి పేజీల్లోనే అమ్మవారి 11 అలంకారాలు, పేర్లు, వివరాలు వివరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, దుర్గగుడి ఐటీ విభాగం, అధికారుల సలహాలతో ఈ యాప్‌ను రూపొందించారు. భక్తుడు వివరాలను తెలుసుకునేందుకు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా అన్ని వివరాలున్నాయి. సమాచార కేంద్రం, రిసెప్షన్ సెంటర్‌లు కూడా ఉన్నాయి. మరోవైపు అన్ని ప్రాంతాల్లోనూ వివిధ విభాగాల అధికారులతో శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈయాప్ ఉంటే దర్శనం చాలా సులువు.

- దసరా ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు
- ధరలు పెంచవద్దని ఆటో, ట్యాక్సీదారులకు హెచ్చరికలు
- ఆహార ధరలు పెంచవద్దని హోటల్స్, ఫుడ్‌కోర్టులకు ఆదేశాలు
- వాణిజ్యదుకాణాలను అందంగా అలంకరించాలని ఆదేశాలు
- సామాన్య భక్తుల కోసం వీవీఐపీలు, వీఐపీలు ఇలా చేయండి
- నగర ప్రజలకు ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

విజయవాడ ప్రజలకు ఇవీ సూచనలు

భక్తులు, యాత్రికులకు నగర ప్రజలు సంప్రదాయ ఆతిథ్యం అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంతానికి అనవసర ప్రయాణాలను నివారించాలని, పరిశుభ్రత పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయద్దని, స్వచ్ఛంద సంస్థలు సేవలకు స్వాగతం పలకాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

భక్తులూ ఇవి పాటించండి

భక్తులు నిర్దేశిత క్యూలైన్లలో ప్రవేశించాలని, తక్కువ సామానుతో రండి, వ్యక్తిగత వస్తువులను జాగ్రత్తగా ఉంచాలన్నారు. పోలీసులు, వలంటీర్ల సూచనలు పాటించాలని, పబ్లిక్ టాయిలెట్లు, తాగునీరు, వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని, అత్యవసరాకు హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉన్నాయని, వృద్ధులు, శిశువులతో ఉన్న మహిళలు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయన్నారు.

కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలకు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, విజయవాడ వచ్చే భక్తుల కోసం సురక్షితమైన, సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన అనుభవం కలిగించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదే సందర్భంలో విజయవాడ నగర ప్రజలు, ఆటో - టాక్సీ డ్రైవర్లు, ఆహార విక్రయదారులు, హోటల్స్, వాణిజ్యదుకాణదారులు నిర్వహించాల్సిన బాధ్యతల గురించి ఇచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. భక్తులు, వీవీఐపీలు, వీఐపీలు, విధుల్లో ఉన్న అధికారులు ఏమి చేయాలో ఆయన దిశానిర్దేశం చేశారు.

ఆటో - ట్యాక్సీ డ్రైవర్లకు సూచనలు..

ఆటో, టాక్సీ డ్రైవర్లు మీటర్/ప్రభుత్వ రేట్ల ప్రకారం మాత్రమే చార్జీలు వసూలు చేయాలని, అధిక ధరలు వద్దని తెలిపారు. వాహనాలు శుభ్రంగా ఉంచి యాత్రికులకు సౌకర్యం కలిగించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించి డ్రాప్ పాయింట్ల వద్ద సహకరించాలని కలెక్టర్ కోరారు. వృద్ధులు, వికలాంగులు, స్త్రీలకు సహాయం చేయాలని తెలిపారు.

ఫుడ్‌కోర్టులు, హోటల్స్ నిర్వాహకులకు..

ఆహార విక్రేతలు, హోటళ్లు శుభ్రత, పరిశుభ్రత పాటించాలని, ధరల జాబితా స్పష్టంగా ప్రదర్శించాలని, తక్కువ ధరలో అన్నపూర్ణ భోజనాలు, తాళీలు అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడవద్దని, పర్యావరణానికి అనుకూల పాత్రలు ఉపయోగించాలని తెలిపారు.



ఇతర వాణిజ్యదుకాణదారులకు ..

దుకాణాలను దీపాలతో, పూలతో, సంప్రదాయ అలంకరణలతో సుందరంగా అలంకరించాలని, యాత్రికులకు స్వాగతం తెలిపేలా దసరా శుభాకాంక్షల బోర్డులు ప్రదర్శించాలని, దుకాణాల ముందు పరసరాలను శుభ్రంగా ఉంచాలని, రోడ్లను ఆక్రమించడం లేదా పాదచారుల కదలికకు అడ్డంకులు కలిగించడం నివారించాలన్నారు. వీలైన చోట తాగునీటి సదుపాయం, విశ్రాంతి కోసం కూర్చునే చోటు కల్పించాలన్నారు. ధరలను స్పష్టంగా ప్రదర్శించి, యాత్రికులను ఎట్టి పరిస్థితుల్లోనూ దోపిడీ చేయరాదన్నారు.

వీవీఐపీలు, వీఐపీలు ఇలా..

వీఐపీలు, వీవీఐపీలకు ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ప్రత్యేక దర్శన సమాయాలను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన వీఐపీలు మాత్రమే ఈ సమయాల్లో వ్యక్తిగత వాహనాలతో ఆలయానికి చేరుకోవచ్చన్నారు. రిఫరెన్సులతో వచ్చేవారు స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద స్వీకరించి, ప్రొటోకాల్ వాహనాలతో ఆలయానికి తీసుకెళ్తారన్నారు. పెద్దబృందాలతో రాకుండా, అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అధికారులూ ఇవి చేయండి

సాధారణ భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మర్యాదకనబడేలా, స్పందనీయంగా వ్యవహరించాలని, పోలీసు, వైద్య, శానిటేషన్, దేవస్థాన సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, సమస్యలు వెంటనే కంట్రోల్ రూంకి తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు.

ఒక్క క్లిక్‌తో సాఫీగా అమ్మ దర్శనం

క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లు: కలెక్టర్

కలెక్టరేట్: దసరా శరన్నవరాత్రుల్లో సాంకేతికత తోడుగా సామాన్య భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శ నం లభించేలా ఏర్పాట్లు చేశామని, టెక్ తోడుగా ఎలాంటి అసౌకర్యం లేకుండా చూ స్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, హోల్డింగ్ ప్రాంతాలు, 1.8 కి.మీ మేర ఉన్న క్యూలైన్, ఇలా వివిధ ప్రాం తాల్లో క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 100 మీటర్లకు ఈ పోస్టర్లను ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉత్సవాల ఏర్పాట్లపై అభిప్రాయాలు లేదా సమస్యలను తెలపవచ్చన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఏర్పాట్లలో ఏదైనా అసౌకర్యాలు ఉన్నాయా? అనే ప్రశ్న కనిపిస్తుందని, ఆ ప్రశ్నకు సమాధానమిచ్చి, అభిప్రాయాన్ని తెలియజేసి సబ్‌మిట్ బటన్ ప్రెస్ చేయాలని సూచించారు. 8885 592974 నెంబరుకు కాల్ చేసి సమస్యను తెలియజేయవచ్చన్నా రు. ఎక్కడైనా సమస్య ఉందని తెలియజేస్తే యుద్ధప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



ప్రపంచంలోనే అతిపెద్ద కార్నివాల్‌గా విజయవాడ ఉత్సవ్

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

విద్యాధరపురం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ ప్రపంచంలోనే అతి పెద్ద కార్నివాల్‌గా ఉండబోతోందని ఉత్సవ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భవానీపురం ఎన్‌డీఏ కార్యాలయంలో ఆదివారం కూటమి నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ఖ్యాతికి పునర్వైభవం తెచ్చేలా ప్రపంచంలోనే అతి పెద్ద కార్నివాల్‌గా ఉత్సవ్ నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మైసూర్ దసరా ఉత్సవాల తరహాలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించామని, దేశం నలుమూలల ఉన్న అతిరథ, మహారథులను ఆహ్వానించామన్నారు. ఆసక్తి గల కళాకారులు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్‌ను కలవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఆర్యవైశ్య మహాసభ ఏపీ గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుడు ముత్తవరపు మురళీకృష్ణ, బొప్పన భవకుమార్, ఫతావుల్లా, సోలంకి రాజు, రామారావు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు నేతలు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేద్దాం

విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని ఉత్సవ్ కమిటీ సభ్యుడు, నిర్మాత సుంకర అనిల్ అన్నారు. భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం పలువురు నేతలతో సమావేశమయ్యారు. దేశం గర్వపడేలా, ప్రపంచం ఆకర్షించేలా ఈ ఉత్సవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కార్పొరేటర్ బుల్లా విజయకుమార్, పీవీ చినసుబ్బయ్య, డాక్టర్ రమ్య, రౌతు రమ్యప్రియ, తిరుపతి అనూష, ఇన్నర్‌వీల్ సన్‌షైన్ అధ్యక్షురాలు భబితజైన్, సెక్రటరీ టీ సుజాత పాల్గొన్నారు.

గ్లోబల్ కల్చరల్ హబ్‌గా నగరమే లక్ష్యం

నగరాన్ని గ్లోబల్ కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎంపీ శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివారం ఆయన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి పున్నమిఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ సందర్భంగా నగరం మరింత శోభాయమానంగా రూపుదిద్దుకుంటుందన్నారు.



కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

టీటీడీకి కూరగాయలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యన్నదాన పథకానికి విజయవాడ సురక్షా కమిటీ కన్వీనర్ కే నరసయ్య ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలను పంపారు. ఈ లారీని విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. సురక్ష కమిటీ, వేంకటేశ్వర భక్త సమాజం ఈ కూరగాయలను సమకూర్చాయి. డీసీపీ సరిత, సురక్ష కమిటీ ప్రతినిధులు బొప్పన మహీనాథ్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేసి గాంధీ శిల్పబజార్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్

హస్తకళలను ప్రోత్సహించాలి

● రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి

బెంజ్‌సర్కిల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరూ హస్తకళలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో ఏపిట్కో నిర్వహణలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్పబజార్‌ను చైర్మన్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏ శేఖర్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఏడీ ఎస్ అపర్ణలక్ష్మి, ఏపిట్కో సంస్థ ప్రతినిధులు ఎస్ గోపాలరావు, డీ సుధీర కుమార్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నికలు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియషన్స్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భవనారి వెంకటేష్‌బాబు, కొప్పోలు సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం 15 పోస్టులకు జరిగిన నామినేషన్లలో 15 నామినేషన్లు మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్జీవో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఏ విద్యాసాగర్, డీ రమణ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ విద్యాసాగర్ సారథ్యంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తామమన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారిగా జీఎస్వీ రత్నకుమార్, రాష్ట్ర సహాధ్యక్షుడిగా స్వామినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సందీప్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు.

డిగ్రీ కాలేజీల బంద్‌కు మద్దతు: ఎస్ఎఫ్ఐ

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీలు సోమవారం నుంచి చేయనున్న బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లోని రూ.6400 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థి లోకమంతా బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాపుల సమస్యలపై డిసెంబరు 26 నుంచి నిరవధిక నిరహార దీక్షలు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ప్రజలు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్నారని కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) రాష్ట్ర చైర్మన్ చలమల్ల ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. సమితి రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాసబత్తుల శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు అమ్మ శ్రీనివాస్ నాయుడు, జానపాముల నాగబాబు, సమతం రాము, జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్లపై తనిఖీలు



ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో దసరా ఏర్పాట్లపై ఉత్సవ ముఖ్యఅధికారిణి దర్భముళ్ళ భ్రమరాంబ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తులకు లడ్డు ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఇంకా ఏమైనా లోటు పాట్లు ఉంటే వాటిని వెంటనే సరిచేయడం జరుగుతోందన్నారు. మరోవైపు అన్న ప్రసాదం తయారీకి, భక్తులకు బఫే విధానంలో అన్నప్రసాదం అందించేందుకు సర్వం సిద్దం చేశామన్నారు.అన్ని ఏర్పాట్లు బాగానే ఉన్నాయని తెలిపారు, ఉత్సవాలలో భక్తుల సంతృప్తి మేరకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు ఆమె వెంట ఏఈవో శ్రీనివాస్(వాసు), సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బందోబస్తు విధులు చేపట్టిన పోలీసులు



దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం నియామకమైన పోలీసులు ఆదివారం ఎయంత్రం నుంచే విధుల్లోకి చేరారు. మొత్తం 4వేలమంది పోలీసులు 3 షిఫ్టుల్లో పనిచేయనున్నారు. ప్రధానంగా ఐదు వారాల క్రితం ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈసారి ఉత్సవాలకు మహిళా భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఉండేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. సీసీ కెమెరాల నిఘాతో పాటు పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. ఏ చిన్న అవాంచనీయ సంఘటన కూడా జరగకుండా చూడాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి దర్శనం కోసం కొండపైకి వెళ్ళేందుకు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతున్నాయి. కాళేశ్వరరావు మార్కెట్ నుంచి కెనాల్ రోడ్డు, కొండపైన, కొండదిగువన, స్నానఘాట్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద పంపిణీ, మెయిన్ టెంపుల్, కొండపైన క్యూలు, గట్టు వెనుకప్రాంతం, పార్కింగ్ ప్రదేశాలు, కేశఖండనశాల ఇలా ప్రతి చోటా కూడా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

కనకదుర్గమ్మకు సాంస్కృతికోత్సవం

- నేటి నుంచి 11 రోజుల పాటు దుర్గమ్మకు కళార్చన
- అమ్మవారి నగరోత్సవంలోనూ కళార్చన
- నిరంతరాయంగా సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కళాకారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్/ఇబ్రహీంపట్నం: కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతూ హోయలు పోతూ తిరిగే ఒంపుల ప్రవాహం ఓ నాట్యం. వేగంగా పరుగులెత్తుతూ ఆ ప్రవాహంలో అలలు చేసే చప్పుళ్ల కమ్మని సంగీతం. మరోవైపు ఇంద్రకీలాద్రిపై ఏర్పాటు చేసిన మహా మండపంలో సాంస్కృతిక ప్రదర్శనల సమ్మేళనం వెరసి దుర్గగుడి పరిసర ప్రాంతాలను భక్తి సాగరంగా మారుస్తోంది. ఈ ఉత్సవాల్లో, అమ్మవారి సమక్షంలో హరికథలు, బుర్రకథలు, పౌరాణిక నాటకాలు నుంచి కర్ణాటక సంగీతం, లలిత సంగితం వరకు ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలా రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళావైభవాన్ని అర్పించి, భక్తుల మనసులను ఆకర్షిస్తున్నారు. మైసూరు దసరా లాంటి గ్రాండ్ 'విజయవాడ ఉత్సవం'గా మారిన ఈ ప్రదర్శనలు, స్థానిక ప్రతిభలకు ప్రాధాన్యత ఇచ్చి ఆకట్టుకొనున్నాయి.

నగరోత్సవంలోనూ కళార్చనలు

శరన్నవరాత్రుల్లో భాగంగా నగరోత్సవానికి బయలుదేరే ముందు, అమ్మవారికి కళా, వాద్య నీరాజనాలు సమర్పించే ఈ ఉత్సవం, భక్తి-కళల సమ్మేళనంగా మారింది. మన రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ గాన, నృత్య, వాద్యాలతో కూడిన ప్రదర్శనలు చేస్తూ, అమ్మవారి పాదాల వద్ద తమ భక్తిని చాటుకుంటున్నారు. భజనలు, కోలాటం, హరికథ, బుర్రకథ, కర్ణాటక గాత్ర, వాద్య సంగీతం, లలిత సంగితం, వివిధ రకాల సంప్రదాయ, జానపద, గిరిజన నృత్యాలు పురాణ సంబంధ అంశాలతో కూడిన ప్రదర్శనలు భక్తులను మురిపిస్తున్నాయి. మంగళవాద్యాలతో పాటు శాక్సాఫోన్, సింధ, గరగాట్టం, బళ్లారి డ్రమ్స్ వాయిద్యాలు ఇంద్రకీలాద్రిని ఒక సాంస్కృతిక పర్వతంగా మార్చాయి.

కళా.. 'సంగమం'!

పవిత్ర సంగమం వేదికగా కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి అక్టోబరు 1 వరకు 10 రోజుల పాటు "విజయనర్తనం" పేరిట దసరా సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు జరగనున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, జానపదం, భక్తి విభావరి, మ్యాజిక్, కోలాటం, మిమిక్రి, వెంట్రిలాక్విజం, యక్షగానం వంటి కళా ప్రదర్శనలను ప్రత్యేక గాంచిన కళారత్న చింతా రవి బాలకృష్ణ, కళారత్న సిల్వెస్టర్, కళా రత్న ఉమామహేశ్వర పాత్రుడు, అజయకుమార్ వంటి ప్రఖ్యాతిగాంచిన నృత్య కళాబృందాలు పాడుతా తీయగా ఫేమ్ రసూల్ వంటి గాయకులు విచ్చేస్తున్నారు.



300 మందితో మహాబృంద నాట్యం

రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి వస్తున్న కూచిపూడి కళాకారులు 300 మంది మహాబృందంగా దుర్గమ్మను స్తుతిస్తూ నాట్యం చేయనున్నారు. 'అయిగిరినందిని' అంటూ దుర్గమ్మకు జయధ్వానాలు పలికే ఈ కీర్తనకు 300 మంది కూచిపూడి విద్యార్థులు లయబద్ధంగా నర్తించనున్నారు. కొండపల్లి కార్పొరేషన్‌తో పాటు ఇటలీ తెలుగు అసోసియేషన్ సంస్థ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనుంది.

మహిళలకు ప్రత్యేక ప్రదర్శనలు

ప్రతిరోజు అమ్మవారి అవతారాలతో ప్రత్యేక పూజలు, మహిళలకు ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో

ఉద్యోగ, పెన్షనర్లలో అసంతృప్తి

● ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరితో ఉద్యోగ, పెన్షనర్లు తీ వ్ర అసంతృప్తితో ఉన్నారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వ ర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ, ముఖ్యమైన శాఖాపరమైన సంఘాల సమన్వయ సమావేశం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలు సంస్థాగతంగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్లకు సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. రిటైరైన ఉద్యోగులకు బకాయిలు చెల్లించలేదని, అనేకమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ కానుకగా కనీసం డీఏలు, పెన్షనర్ల బకాయిలు, పీఆర్సీ కమిషనర్ నియామకం జరపాలని కోరారు. ముఖ్యమంత్రి అంగీకరించినప్పటికీ ఇంకా పెండింగ్‌లో ఉంచిన ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో తక్షణం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు, ప్రభుత్వ పథకాల వర్తింపు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. భవిష్యత్తులో జేఏసీ తలపెట్టే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు, దామోదరరావు పిలుపునిచ్చారు. అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి కె.సంగీతరావు, వివిధ సంఘాల రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

అవినీతి వెలుగు!

(5వ పేజీ తరువాయి)

చేశారు. అయినా ఈ సీసీ పెడన మండలానికి వెళ్లకుండా, మచిలీపట్నం మండలంలోనే పనిచేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటోంది. తెరవెనుక ఉండి మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయం పరిపాలనా వ్యవహారాల్లో తన హవా కొనసాగిస్తోంది. డీఆర్‌డీఏ అధికారులు చేసిన తప్పిదాలన్నీ తనకు తెలుసని, వీటి ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెబుతున్న ఈ సీసీ, తనను మళ్లీ మచిలీపట్నం మండలంలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారని డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది చెప్పుకుంటున్నారు.

సంబరం నేడే

(5వ పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు, ఎంతమంది అన్నదానంలో ప్రసాదంలో స్వీకరించారన్న లెక్కలను తేల్చడానికి హెడ్‌కౌంట్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి పరిసరాలను 500 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. ఇందు కోసం మోడల్ గెస్ట్ హౌస్ అధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్, మహామండపంలో దేవస్థాన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. మోడల్ గెస్ట్‌హౌస్‌లో మూడు ఎల్ఈడీ వీడియో వాల్స్‌ను సిద్ధం చేశారు.

ఫ్రేమ్ మోడల్ క్యూ లైన్లు

ఈ ఏడాది అధికారులు క్యూలైన్ల డిజైన్లలో మార్పులు చేశారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన క్యూల డిజైన్లకు భిన్నంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేశారు. ఇనుప గడ్డర్లను భూమిలో పాతి వాటికి ఇనుప కంచెను అల్లుతూ వెళ్లేవారు. వాటి వల్ల భక్తులకు స్వల్ప గాయాలు అయ్యేవి. ఈసారి వాటిని తొలగించి ఫ్రేమ్ మోడల్ క్యూలను ఏర్పాటు చేశారు. ఇనుప కంచె స్థానంలో బారికేడ్లుగా ఉండే ఫ్రేమ్‌లను ఏర్పాటు చేశారు. ఇంత వరకు ఏర్పాటు చేసిన క్యూల్లోకి వెళ్లిన భక్తులు అత్యవసరం సమయంలో బయటకు వచ్చే మార్గం ఉండేది కాదు. క్యూలో కటింగ్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు క్యూలైన్లలో ప్రతి 50 మీటర్లకు ఒక అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ అత్యవసర ద్వారం ఉందని భక్తులకు తెలిసేలా ఆ గేటుకు ఎరుపు రంగు వేశారు. అదేవిధంగా అత్యవసర ద్వారం ఉందని ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. రూ.300, రూ.100, ఉచిత క్యూలు మాత్రమే ఈసారి అమలు చేస్తున్నారు. రూ.500 టికెట్‌ను శరన్నవరాత్రుల్లో రద్దు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలోకి ప్రవేశించిన భక్తులు ప్రశాంతంగా ముందుకు కదిలేందుకు అధికారులు లలితా సహస్ర నామాలను మైకుల ద్వారా వినిపించాలని నిర్ణయించారు. వినాయకుడి ఆలయం వద్ద, క్యూల మధ్యలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. మహామండపం ఆరో అంతస్తులో జరిగే పూజలు, యాగశాలలో జరిగే హోమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాటిని ఈ స్క్రీన్లపై భక్తులకు వీక్షించేలా చేస్తారు. దర్శనానికి ఎంత సమయం పడుతుంది, ఏ కారణంగా క్యూలైన్లు ఆగాయన్న సమాచారాన్ని వాటిపై ప్రదర్శిస్తారు. ప్రసాదాల విక్రయాలకు కనకదుర్గ నగర్‌లో అధికారులు 12 లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒక కౌంటర్‌ను వృద్ధులకు, మరో కౌంటర్‌ను వికలాంగులకు కేటాయించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

గురుపాదుకా ఆలయంలో మృత్యుంజయ హోమం



గన్నవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీపంచతత్వ గురుపాదుకా ఆలయంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ అనుగ్రహంతో మహాలయ అమావాస్య సందర్భంగా గురు దత్తాత్రేయ స్వామివారికి తైలాభిషేకం ఆదివారం నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్, సరిత దంపతులచే మహా మృత్యుంజయ హోమాన్ని జరిపారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక శ్రీలలిత సహస్రనామ పారాయణం, శ్రీచండీ పారాయణతో కూడిన చండీహోమం చేశారు. ట్రస్టీ గొంది రాజశేఖర్, మూల్పూరి మాధవన్ పాల్గొన్నారు.

ఓపీక పరీక్షిస్తున్నారు!

- వైద్యులు లేక రోగుల అవస్థలు
- డ్యూటీలో ఉండేది ఒక్కరే
- బదిలీలు, డిప్యుటేషన్లపై వెళ్లిన వైద్యులు
- చికిత్స కోసం గంటల తరబడి పడిగాపులు పడుతున్న రోగులు



చికిత్స కోసం పడిగాపులు పడుతున్న రోగులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో సరిపడినంత మంది వైద్యులు లేక చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉయ్యూరు, తోట్లవల్లూరు, కంకిపాడు, పమిడిముక్కల మండలాలకు కేంద్రంగా ఉన్న ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు చుట్టుపక్కల 50 గ్రామాల నుంచి ప్రతిరోజూ 200 మంది వరకు ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. వైద్యశాలలో పనిచేస్తున్న సర్జన్, దంతవైద్యుడు, గైనకాలజిస్టు, ఎండీ జనరల్ మెడిసిన్, డయాబెటిక్ వైద్యుడితో పాటు నర్సు కొద్దిరోజుల క్రితం బదిలీపై వేరే వైద్యశాలలకు వెళ్లగా వారి స్థానంలో ఇప్పటి వరకు ఎవరూ రాకపోవడంతో ఉన్న ముగ్గురు వైద్యులలో ఒకరు డిప్యుటేషన్‌పై మచిలీపట్నం వెళుతుండగా, ఒకరు నైట్ డ్యూటీలో ఉంటుండగా రోగులకు వైద్యసేవలందక గంటలతరబడి పడిగాపులు పడవలసిన వస్తుంది. ప్రతిరోజూ 200 వరకు ఓపీ ఉంటుంది. దీనికితోడు పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల నుంచి యాక్సిడెంట్ కేసులు, మెడికో లీగల్ కేసులకు పోస్టుమార్టం ఇక్కడే చేయవలసి వస్తున్న నేపథ్యంలో వైద్యులకు రోగులు చాలా సమయం వేచి ఉండవలసిన పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్నారు.

సకాలంలో వైద్యం అందటంలేదు

వందల సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తుంటే సరిపడనంతమంది డాక్టర్లు లేక గంటల తరబడి వేచి ఉండవలసి వస్తుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి సకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు.

- టి.శివన్నారాయణ, స్థానికుడు

వైద్యులను నియమించాలని లేఖలు రాసినా ఫలితం లేదు

బదిలీపై వెళ్లిన డాక్టర్ల స్థానంలో ఎవ్వరూ రాకపోవడంతో చికత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న డాక్టర్లలో ఒక గైనకాలజీ సర్జన్‌ను వారానికి మూడు రోజులు డిప్యుటేషన్‌పై మరో ఆసుపత్రికి పంపుతున్నారు. ప్రతిరోజూ 200 వరకు ఓపీ ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సరిపడనంత మంది డాక్టర్లు లేక రోగులు అవస్థలు పడుతున్నారని వెళ్లినవారి స్థానంలో డాక్టర్లను నియమించాలని డీసీహెచ్‌కు లేఖలు రాసినా పట్టించుకోవడం లేదు. 30 పడకల ఆసుపత్రి కావడంతో ఔట్ పేషెంట్లతో పాటు ఇన్‌పేషెంట్లు ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో వెంటనే డాక్టర్లను నియమించాలి.

- మండవ జయదేవ్,
ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్

లక్ష్మీతిరుపతమ్మ ఆలయం ముస్తాబు



విద్యుత్ కాంతులతో లక్ష్మీతిరుపతమ్మ ఆలయం

గన్నవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరం శ్రీలక్ష్మీతిరుప తమ్మ దేవస్థానం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంతో పాటు అమ్మవారి కల్యాణ వేదికను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పద కొండు రోజులు పాటు జరిగే దేవి శరన్నవరాత్రులకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది అమ్మవారి కల్యాణ వేదికలో మహోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయలను కల్పించనునట్లు చెప్పారు. ఉత్సవాలు ప్రారంభించి పాతికేళ్లు పూర్తయ్యిందని తెలిపారు. సోమవారం నుంచి మహోత్సవాలు ప్రారంభమవుతాయని పరిసర ప్రాంతాల భక్తులు వచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

విజయవాడ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నున్న చెరువు సెంటర్‌లోని కనక దుర్గాదేవి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా మహోత్సవ బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు జరగ నున్న ఉత్సవాలకు సంబంధించి పలు వివరాలను ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుంటక సంధ్యారాణి వివరించారు. ఉత్సవాల అనంతరం రూ. 3.50 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టను న్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రామడుగు సీతారామారావు, కార్యదర్శి అంగజాల హనుమ, దండు సుబ్రహ్మణ్యరాజు, అర్చకుడు రొంపిచర్ల దత్తు, కమిటీ సభ్యులు దుంపల కృష్ణారావు, బొంతు సరోజినిదేవి, భుక్యా బాలాజీ, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ జన్మదినం

పెనమలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ అభిమానులు మండలంలోని వివిధ ప్రాంతాల్లో కేకులు కోసి పంచిపెట్టారు. నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు సంగెపు రంగారావు ఆధ్వర్యంలో పంచుమర్తి అనురాధ జన్మదిన వేడుకలు గోసాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంగెపు రంగారావు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అనురాధ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కొడాలి పానకాలరావు, మసనం శ్రీనివాసరావు, ఎంవీఎస్ మూర్తి, ముట్టే రామచంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సహస్ర కుంకుమార్చన

కానూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కానూరు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు సహస్ర కుంకుమార్చన కార్యక్రమం జరగనుంది. సోమవారం అమ్మవారిని బాలా త్రిపు రసుందరీ దేవిగా అలంకరించనున్నారు. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ మహోత్సవాలు జరుగుతాయని దేవాలయం కార్యానిర్వాహణాధికారి తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని కోదాడకు చెందిన ప్రముఖ మసీదు కమిటీ ఇమామ్ మౌలానా అత్‌హర్ అలీ సాహెబ్ అన్నారు. బాపులపాడు ఎంజీనగర్‌లో మసీదు అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా ఆది వారం అలీ సాహెబ్ అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. సభలో ఏలూరు, కోదాడ, గుడివాడ మసీదు ఇమామ్‌లు జనాబ్ అఫ్రోజ్ అహమ్మద్ సాహెబ్, హజ్రత్ మౌలానా హామిద్ సాహెబ్ మౌలానా రఫీఖ్ అహ్మద్‌లు ప్రసంగించారు. మసీదు కమిటీ నాయకులు అబ్దుల్ బారీ, సయ్యద్ జానీ, షేక్ రఫీ, బాషా, నౌజవాన్ కమిటీ సభ్యులు నాజర్, నాగూర్, సాదిక్ తదితరులు పర్యవేక్షించారు.

జోగి.. నోరు అదుపులో పెట్టుకో

జనసేన జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు

కంకిపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు జోగి రమేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ, మైక్ కనబడితే జోగి రమేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడిపై ఇష్టానుసారం మాట్లాడు తున్నాడని మండిపడ్డారు. జోగిపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జోగి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జనసేన నాయకులు కోన నాని పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సుబ్బారావు

మానవత విద్యానిధికి రూ.25 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మానవత నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యానిధికి స్థానిక లయన్స్ క్లబ్ నేత నండూరి సుబ్బారావు కుమార్తె రాయవరపు ఆశావల్లి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆదివారం మానవత కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా సుబ్బారావు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత నిర్వాహకులు ఘంటా ఇందిరాదేవి, గంటా సత్యనారాయణ, వడ్డీ రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, మరీదు వెంకటస్వామి, దయాల ప్రభాకర్, కొట్నేని రామచంద్రరావు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి నిర్వహించనున్న దేవీ నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అలంకరణకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు రాజేశ్వరీ అమ్మవారికి ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చ కులు చక్రావధానుల సీతారామాచార్యులకు వాటిని అందజేశారు.



కానూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మునిసిపాలిటీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీలోని కానూరుతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెప్పారు. కానూరులోని మహాదేవపురం కాలనీ నుంచి వృద్ధాశ్రమం వరకు రూ. 1.53 కోట్ల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులను సైతం కలిసి నిధులు అడుగుతున్నానని తెలిపారు. నగరానికి అత్యంత సమీపంలో ఉన్న కానూరులో ఎక్కువ మంది నివాసానికి ముందుకు వస్తున్నారని, వారి కోసం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ధైర్యంతో కేన్సర్‌ను గెలవాలి

● వరల్డ్ రోజ్ డే సందర్భంగా బాధితులకు గులాబీలు, పళ్లు పంపిణీ



కేన్సర్ బాధితురాలికి పళ్లను అందజేస్తున్న షేక్ నజీర్, డాక్టర్ విజయభాస్కర్

కానూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ బాధితులు ధైర్యం, సంతోషం అనే ఆయుధంతో కేన్సర్‌ను గెలవాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ ఆకాంక్షించారు. వరల్డ్ రోజ్ డే సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానూరులోని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో కేన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్న రోగులకు ఆదివారం ఆయన గులాబీలు, పళ్లు, బొమ్మలను అందజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్, కేన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ ఇషాంత్, డాక్టర్ పద్మజలు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ కానూరు అధ్యక్షుడు దోనేపూడి రవికిరణ్, నెట్టెం శ్రీనివాస్, మోదుగు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీస్

వెంకటరత్నం దాతృత్వాన్ని అభినందించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



చిన్నారులతో కానిస్టేబుల్ వెంకటరత్నం

పెనమలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎండలో బడి నుంచి ఇంటికి వెళ్తున్న చిన్న పిల్లల దుస్థితి చలించాడు ట్రాఫిక్ పోలీస్ వెంకటరత్నం. కాళ్లకు చెప్పులు లేకుండా ఎర్రటి ఎండలో కాళ్లు కాలుతూ రోడ్డు దాటుతున్న పోరంకి యానాది కాలనీ పిల్లల దుస్థితిని చూశాడు. వెంటనే స్పందించి వారందరినీ దగ్గర్లో ఉన్న చెప్పుల షాపునకు తీసుకెళ్లి చెప్పులను కొనిపించి వారి కళ్లలో ఆనందాన్ని నింపాడు. పెనమలూరు ట్రాఫిక్ పోలీసుస్టేషన్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నం తన మానవత్వాన్ని చాటి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాడు. వెంకటరత్నం చూపిన దాతృత్వానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ తాడిగడప అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు అభినందించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

వీరవల్లి ఎస్సై శ్రీనివాస్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో హిస్టరీ షీట్ కలిగిన వ్యక్తులకు కౌన్సె లింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

భారీ వర్షానికి నేలకొరిగిన వృక్షాలు

● విద్యుత్ అంతరాయంతో ప్రజల ఇబ్బందులు



కంకిపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామా ల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులపై ఉన్న భారీ వృక్షాలు నేలకొరిగాయి. పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులు నీట మునిగాయి. భారీ శబ్ధాలతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా ప్రజలు భయ భ్రాంతులకు గురయ్యారు. మండలంలోని ప్రొద్దుటూరు, మద్దూరు, కంకిపాడు, ఈడుపుగల్లులో అనేక ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. భారీ వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ అంత రాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విస్తృతంగా కృషి చేశారు.



దాండియా ఆడుతున్న ఉపాధ్యాయులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో దాండియా వేడుకలు

ప్రసాదంపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడలో నవరాత్రుల సందర్భంగా మొట్టమొదటిసారిగా దాండియా వేడుకలు ఘనంగా ఆదివారం జరిగాయి. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు దాండియా నృత్యం చేస్తూ పాటలు పాడుతూ పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ, పాఠశాలలో ముందుగానే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు ధరించి ఆకర్షణగా నిలిచారు. ఉత్తమ వస్త్రధారణ ధరించిన వారికి ఉత్తమ వస్త్రధారణ జంటలకు పరిమి పవన్ చంద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రో వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురజాడ రచనలు భావితరాలకు స్ఫూర్తి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాంబశివరాయల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : గురజాడ రచనల్లోని పాత్రలు సమాజంలో జరిగే వాటికి ప్రతిబింబాలని, సమాజోద్ధరణకు ఆయన చేసిన రచనలు స్ఫూర్తి ప్రదాతలని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. కానుమోలులో ఆదివారం గురజాడ 163వ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: సాంఘిక దురాచారాలు నిర్మూలనకు గురజాడ అప్పారావు చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో గురజాడ 163వ జయంతి వేడుకను నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి మారుబోయిన పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవత నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ముందడుగు వేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే శాస్త్రసాంకేతిక రంగాల్లో అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందిస్తూ సృజనాత్మకతను వెలికితీసేందుకు వీఎంఎం (విద్యార్థి విజ్ఞాన్ మంతన్) ఉపయోగపడుతుందని రెవ. బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. వీరవల్లి హైస్కూల్ ఉపాధ్యాయురాలు, వీఎంఎం జిల్లా కో ఆర్డినేటర్ జగతితో కలిసి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. భారతదేశ విజ్ఞాన వారసత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ వారిలోని నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వీబీహెచ్ఎ (విజ్ఞాన ప్రతిభాశోధన పరీక్ష), జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీ పరీక్షలు 6 నుంచి 11వ తరగతి విద్యార్థులకు వివిధ విభాగాలుగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారని, అక్టోబరు 28 నుంచి నవంబరు వరకూ పరీక్షలు నిర్వహించబడతాయని కోఆర్డినేటర్ జగతి వివరించారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం శ్రీ మల్లికార్జున హైస్కూల్ హెచ్ఎం మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి విజ్ఞాన్ మంతన్ కరపత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ జగతి, రెవ. సంతోష్‌కుమార్



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరపున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రజ్ఞానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలిత మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి దర్శనభాగ్యం

గత రెండు దసరాల్లో భక్తులకు అందుబాటులో లేని పరిస్థితి

- దాతల సహకారంతో అందంగా రూపుదిద్దుకున్న ఆలయం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు ఈసారి మల్లేశ్వరస్వామిని దర్శించుకునే అవకాశం లభిస్తోంది. కనకదుర్గమ్మకు కుడివైపుగా కొంచెం దూరంలో స్వయంభువుగా ఉన్న మల్లేశ్వరుడు కొలువై ఉన్నారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడ స్వామివారు అమ్మవారికి కుడివైపున ఉండడం విశేషం. దసరా మహోత్సవాల్లో దుర్గగుడికి లక్షలాది మంది భక్తులు దర్శనానికి వస్తారు. ఆలయ ఆవరణ చిన్నగా ఉండటం, రానురానూ భక్తుల సంఖ్య కూడా భారీగా ఉండటంతో నియంత్రణ చేయడం కష్టంగా ఉండటంతో పోలీసులు భద్రత దృష్ట్యా మల్లేశ్వరస్వామి దర్శనాన్ని నిలిపివేశారు. మరో వైపు ఏనాడో నిర్మించిన ఆలయం కావడంతో ఆలయ గోపురం నుంచి సున్నం రాలి పోతుండటంతో మరమ్మతులు చేపట్టారు. దాత సంగా నరసింహరావు, రామకృష్ణ హౌసింగ్ ఎస్టేట్ సంస్థలు ఇచ్చిన రూ.7 కోట్ల నిధుల సహకారంతో పాటు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మరో రూ.5 కోట్లను వ్యయం చేసి ఆలయ ప్రాంగణాన్ని విస్తరణ చేయడం, కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం, ఆలయ ముఖద్వారాన్ని విస్తరించడం, గ్రానైట్ల రాళ్ల అమరిక ఇలా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇటీవలే భక్తులు స్వామిని దర్శించుకోవడానికి అనుమతించారు. దసరా ఉత్సవాల్లో రద్దీని పురస్కరించుకుని పోలీసుల ఆంక్షల కారణంగా కూడా మూడు నాలుగేళ్లుగా భక్తులు స్వామివారిని దర్శించుకోలేకపోయారు. కాగా, ఈ దసరా మహోత్సవాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని ఈవో శీనానాయక్ తెలిపారు.

దసరా సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 కాలేజీల నుంచి 550 మంది ఎన్ఎస్ఎస్ క్యాడిడేట్లను దసరా ఉత్సవాల్లో వలంటీర్లుగా సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ అన్నారు. విజయవాడలోని కేవీఎస్ఆర్ ఫార్మాసూటికల్ సైన్స్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ఆయనతో సందర్శించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగజోషి హాజరయ్యారు.



ఇంద్రకీలాద్రిపై బంగారు కాంతులు



ఏలూరు రోడ్డులో ఉత్సవ శోభ



ఇంద్రకీలాద్రిపై రాజమండపం ధగధగలు

దసరా వైభవం

మెరిసిపోతున్న ఇంద్రగిరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగులతో మెరిసిపోతోంది. అమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని భావించిన అధికారులు అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్ల పొడవునా విద్యుత్ వెలుగులను నింపారు. కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ కూడా కాంతులతో అందంగా ముస్తాబైంది. ఇక నగరమంతటా ఉత్సవ వైభవాన్ని చాటేలా స్వాగత తోరణాలు తీర్చిదిద్దారు.





కాళేశ్వరరావు మార్కెట్‌కు విద్యుత్ వెలుగులు

భక్తుడి చేతిలో దసరా దివ్యదర్శిని యాప్



ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలు ఈనెల 22న సోమవారం నుంచి 11 రోజులపాటు జరగనున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని అంచనా. గత ఏడాది 13.5 లక్షల మంది రాగా, ఈసారి 20 లక్షల మంది వస్తారని అధికారుల అంచనా. ఇంత పెద్ద ఎత్తున జరిగే దసరా మహోత్సవాలకు సంబంధించి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారు. వీరందరికీ దుర్గగుడిలో జరిగే పూజలు, ఏర్పాట్లు, దర్శనానికి ఎలా వెళ్లాలి, తదితర అంశాల అన్నింటి అవగాహన కల్పించేలా యాప్‌ను రూపొందించింది. అమరావతి సాఫ్ట్‌వేర్ సంస్థ ఈ యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నవారందరి చేతుల్లోకి వెళ్లింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే దుర్గగుడిలో జరిగే అన్ని అంశాలు ఇట్టే తెలిసిపోతాయి. యాప్‌లో దుర్గామల్లేశ్వరుల ఆవిర్భావం, దుర్గమ్మవిశిష్టత అందులో పొందుపరిచారు. తొలి పేజీల్లోనే అమ్మవారి 11 అలంకారాలు, పేర్లు, వివరాలు వివరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, దుర్గగుడి ఐటీ విభాగం, అధికారుల సలహాలతో ఈ యాప్‌ను రూపొందించారు. భక్తుడు వివరాలను తెలుసుకునేందుకు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా అన్ని వివరాలున్నాయి. సమాచార కేంద్రం, రిసెప్షెన్ సెంటర్‌లు కూడా ఉన్నాయి. మరోవైపు అన్ని ప్రాంతాల్లోనూ వివిధ విభాగాల అధికారులతో శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈయాప్ ఉంటే దర్శనం చాలా సులువు.

భక్తులకు మంచి ఆతిథ్యం ఇవ్వండి

- దసరా ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు
- ధరలు పెంచవద్దని ఆటో, ట్యాక్సీదారులకు హెచ్చరికలు
- ఆహార ధరలు పెంచవద్దని హోటల్స్, ఫుడ్‌కోర్టులకు ఆదేశాలు
- వాణిజ్యదుకాణాలను అందంగా అలంకరించాలని ఆదేశాలు
- సామాన్య భక్తుల కోసం వీవీఐపీలు, వీఐపీలు ఇలా చేయండి
- నగర ప్రజలకు ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలకు ఈ ఏడా ది రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది భ క్తులు తరలివచ్చే అవకాశం ఉందని అం˘నా వేస్తున్నామని, విజయవాడ వచ్చే భక్తుల కోసం సురక్షితమైన, సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన అనుభవం కలిగించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదే సందర్భంలో విజయవాడ నగర ప్రజలు, ఆటో - టాక్సీ డ్రైవర్లు, ఆహార విక్రయదారులు, హోటల్స్, వాణిజ్యదుకాణదారులు నిర్వహించాల్సిన బాధ్యతల గురించి ఖచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను ఆ యన ఆదివారం మీడియాకు విడుదల చే శారు. భక్తులు, వీవీఐపీలు, వీఐపీలు, వి ధుల్లో ఉన్న అధికారులు ఏమి చేయాలో ఆయన దిశానిర్దేశం చేశారు.



ఆటో - ట్యాక్సీ డ్రైవర్లకు సూచనలు..

ఆటో, టాక్సీ డ్రైవర్లు మీటర్/ప్రభుత్వ రేట్ల ప్రకారం మాత్రమే చార్జీలు వసూలు చేయాలని, అధిక ధరలు వద్దని తెలిపారు. వాహనాలు శుభ్రంగా ఉంచి యాత్రికులకు సౌకర్యం కలిగించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించి డ్రాప్ పాయింట్ల వద్ద సహకరించాలని కలెక్టర్ కోరారు. వృద్ధులు, వికలాంగులు, స్త్రీలకు సహాయం చేయాలని తెలిపారు.

ఫుడ్‌కోర్టులు, హోటల్స్ నిర్వాహకులకు..

ఆహార విక్రేతలు, హోటళ్ల శుభ్రత, పరిశుభ్రత పాటించాలని, ధరల జాబితా స్పష్టంగా ప్రదర్శించాలని, తక్కువ ధరలో అన్నపూర్ణ భోజనాలు, తాళీలు అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడవద్దని, పర్యావరణానికి అనుకూల పాత్రలు ఉపయోగించాలని తెలిపారు.

ఇతర వాణిజ్యదుకాణదారులకు ..

దుకాణాలను దీపాలతో, పూలతో, సం ప్రదాయ అలంకరణలతో సుందరంగా అలంకరించాలని, యాత్రికులకు స్వాగ తం తెలిపేలా దసరా శుభాకాంక్షల బోర్డు లు ప్రదర్శించాలని, దుకాణాల ముందు పరసరాలను శుభ్రంగా ఉంచాలని, రోడ్లను ఆక్రమించడం లేదా పాదచారుల కదలికకు అడ్డంకులు కలిగించడం నివారించాలన్నారు. వీలైన చోట తాగునీటి సదుపాయం, విశ్రాంతి కోసం కూర్చునే చోటు కల్పించాలన్నారు. ధరలను స్పష్టంగా ప్రదర్శించి, యాత్రికులను ఎట్టి పరిస్థితుల్లోనూ దోపిడీ చేయరాదన్నారు.

విజయవాడ ప్రజలకు ఇవీ సూచనలు

భక్తులు, యాత్రికులకు నగర ప్రజలు సంప్రదా య ఆతిథ్యం అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంతానికి అనవసర ప్రయాణాలను నివారించాలని, పరిశుభ్రత పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయద్దని, స్వచ్ఛంద సంస్థలు సేవలకు స్వాగతం పలకాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

వీవీఐపీలు, వీఐపీలు ఇలా..

వీఐపీలు, వీవీఐపీలకు ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ప్రత్యేక దర్శన సమయాలను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన వీఐపీలు మాత్రమే ఈ సమయాల్లో వ్యక్తిగత వాహనాలతో ఆలయానికి చేరుకోవచ్చన్నారు. రిఫరెన్సులతో వచ్చేవారు స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద స్వీకరించి, ప్రొటోకాల్ వాహనాలతో ఆలయానికి తీసుకెళ్తారన్నారు. పెద్దబృందాలతో రాకుండా, అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

భక్తులూ ఇవి పాటించండి

భక్తులు నిర్దేశిత క్యూలైన్లలో ప్రవేశించాలని, తక్కువ సామానుతో రండి, వ్యక్తిగత వస్తువులను జాగ్రత్తగా ఉంచాలన్నారు. పోలీసులు, వలంటీర్ల సూచనలు పాటించాలని, పబ్లి క్ టాయిలెట్లు, తాగునీరు, వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని, అత్యవసరాకు హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉన్నాయని, వృద్ధులు, శిశువులతో ఉన్న మహిళలు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయన్నారు.

అధికారులూ ఇవి చేయండి

సాధారణ భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మర్యాదకనబడేలా, స్పందనీయంగా వ్యవహరించాలని, పోలీసు, వైద్య, శానిటేషన్, దేవస్థాన సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, సమస్యలు వెంటనే కంట్రోల్ రూంకి తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు.

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

గుడివాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి, గౌరీశంకరస్వామి, వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానాల్లో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ప్రచార పత్రికలను టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనావు, వెనిగండ్ల రామకృష్ణ(నాని)లు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో ఆయా దేవాలయాల ధర్మకర్తల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు వైభవోపేతంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించున్నామన్నారు. అమ్మవారు విశేషంగా ఈ ఏడాది 11 అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వరస్వామి దేవస్థాన ఉత్సవకమిటీ ఛైర్మన్ పట్టపు చిన్నా, ఆయా దేవస్థానాల ధర్మకర్తల కమిటీ ఛైర్మన్‌లు నెరుసు బోసు, అంగడాల సతీష్, ధర్మకర్తలు, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ

క్రీడాకారులను ప్రోత్సహించడంలో స్టేడియం కమిటీ కృషి



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్

గుడివాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఉమ్మడి కృష్ణా జిల్లాల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు.

● కిలారపు రంగప్రసాద్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలను సాధించారన్నారు. ఎన్టీఆర్ జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఎన్.వి నరేంద్ర మాట్లాడుతూ 20సంవత్సరాల నుంచి స్టేడియం కమిటీ వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌ను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.రవికుమార్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో స్టేడియం కమిటీ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. కమిటీ జీవిత కాల సభ్యులు, 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సంబరం నేడే

(5వ పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు, ఎంతమంది అన్నదానంలో ప్రసాదంలో స్వీకరించారు అన్న లెక్కలను తేల్చడానికి హెడ్‌కౌంట్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి పై నుంచి దిగువ వరకు మొత్తం పరిసరాలను 500 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. ఇందు కోసం మోడల్ గెస్ట్‌హౌస్ అధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్, మహామండపంలో దేవస్థాన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. మోడల్ గెస్ట్‌హౌస్‌లో మూడు ఎల్‌ఈడీ వీడియో వాల్స్‌ను సిద్ధం చేశారు.

ఫ్రేమ్ మోడల్ క్యూ లైన్లు

ఈ ఏడాది అధికారులు క్యూలైన్ల డిజైన్లలో మార్పులు చేశారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన క్యూల డిజైన్లకు భిన్నంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేశారు. ఇనుప గడ్డర్లను భూమిలో పాతి వాటికి ఇనుప కంచెను అల్లుతూ వెళ్లేవారు. వాటి వల్ల భక్తులకు స్వల్ప గాయాలు అయ్యేవి. ఈసారి వాటిని తొలగించి ఫ్రేమ్ మోడల్ క్యూలను ఏర్పాటు చేశారు. ఇనుప కంచె స్థానంలో బారికేడ్లుగా ఉండే ఫ్రేమ్‌లను ఏర్పాటు చేశారు. ఇంత వరకు ఏర్పాటు చేసిన క్యూల్లోకి వెళ్లిన భక్తులు అత్యవసరం సమయంలో బయటకు వచ్చే మార్గం ఉండేది కాదు. క్యూలో కటింగ్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు క్యూలైన్లలో ప్రతి 50 మీటర్లకు ఒక అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ అత్యవసర ద్వారం ఉందని భక్తులకు తెలిసేలా ఆ గేటుకు ఎరుపు రంగు వేశారు. అదేవిధంగా అత్యవసర ద్వారం ఉందని ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. రూ.300, రూ.100, ఉచిత క్యూలు మాత్రమే ఈసారి అమలు చేస్తున్నారు. రూ.500 టికెట్‌ను శరన్నవరాత్రుల్లో రద్దు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలోకి ప్రవేశించిన భక్తులు ప్రశాంతంగా ముందుకు కదిలేందుకు అధికారులు లలితా సహస్ర నామాలను మైకుల ద్వారా వినిపించాలని నిర్ణయించారు. వినాయకుడి ఆలయం వద్ద, క్యూల మధ్యలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. మహామండపం ఆరో అంతస్తులో జరిగే పూజలు, యాగశాలలో జరిగే హోమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాటిని ఈ స్క్రీన్లపై భక్తులకు వీక్షించేలా చేస్తారు. దర్శనానికి ఎంత సమయం పడుతుంది, ఏ కారణంగా క్యూలైన్లు ఆగాయన్న సమాచారాన్ని వాటిపై ప్రదర్శిస్తారు. ప్రసాదాల విక్రయాలకు కనకదుర్గ నగర్‌లో అధికారులు 12 లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒక కౌంటర్‌ను వృద్ధులకు, మరో కౌంటర్‌ను వికలాంగులకు కేటాయించారు.

పండుగకు ఊరువెళ్లే వారు సమాచారం ఇవ్వండి : సీఐ

గుడివాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సెలవుల్లో ఇంటిని వదిలి సొంత ఊళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా సమాచారాన్ని పోలీసస్టేషన్‌లో అందిస్తే, రాత్రి గస్తీ సమయాల్లో సదరు ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ తెలిపారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలతో ఇళ్లలో దొంగతనాలు జరుగకుండా నివారించవచ్చునన్నారు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే 1930కి కాల్ చేస్తే సహాయ,సహకారాలు అందిస్తారని టూటౌన్ సీఐ హనీష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు డానిష్ సమర్‌కుమార్



పామర్రు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద ఆదివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ క్వాడ్ విభాగంలో విజేతగా నిలిచి రెండు సిల్వర్ పతాకాలు సాధించిన డానిష్ సమర్‌కుమార్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. గ్రామీణ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పోటీలకు డానిష్ ఎంపిక కావడం గర్వ కారణమని కురుమద్దాలి ప్రజలు ప్రత్యేక ప్రశంసల జల్లులు కురిపించారు. డానిష్‌కు ప్రత్యేక తార్ఫీదు నిచ్చిన కోచ్ నాగసేన్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

అవినీతి వెలుగు!

(5వ పేజీ తరువాయి)

చేశారు. అయినా ఈ సీసీ పెడన మండలానికి వెళ్లకుండా, మచిలీపట్నం మండలంలోనే పనిచేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటోంది. తెరవెనుక ఉండి మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయం పరిపాలనా వ్యవహారాల్లో తన హవా కొనసాగిస్తోంది. డీఆర్‌డీఏ అధికారులు చేసిన తప్పిదాలన్నీ తనకు తెలునని, వీటి ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెబుతున్న ఈ సీసీ, తనను మళ్లీ మచిలీపట్నం మండలంలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారని డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది చెప్పుకుంటున్నారు.



పారిశుధ్య కార్మికుల కృషి ఫలితమే దోమల నివారణ

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : దోమల నివారణలో పారిశుధ్య కార్మికుల చేసిన కృషి ఫలితమేనని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శాఖ, అంగన్వాడీల స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, రహదారులపై విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను పడేయవద్దని హెచ్చరించారు. పారిశుధ్య


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

కార్మికుల కృషి ఫలితంగానే స్వచ్ఛ గుడివాడ దిశగా అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, టీడీపీ నాయకులు సత్యసాయి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ జోగానంద, డాక్టర్ జాన్‌డేవిడ్, డాక్టర్ సుష్మ, పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

● లింగమనేని రామలింగేశ్వరరావు


రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

కూచిపూడి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయటంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం రామలింగేశ్వరరావును నియమించిన సందర్భాన్ని పురస్కరించుకుని నిడుమోలులో పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్థులు ఆదివారం సాయంత్రం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పార్టీలో నిబద్ధత గల నేతగా పార్టీ ఆశయాలకనుగుణంగా పని చేస్తూ మండలంలో టీడీపీ నేతలను, కార్యకర్తలను రామలింగేశ్వరరావు ఒక్కతాటిపైకి తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి మైనేని ఇందిర, తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీదాస్, జొన్నలగడ్డ సత్యనారాయణ, జొన్నలగడ్డ సామ్రాజ్య లక్ష్మీ, జొన్నలగడ్డ రవి, గుత్తికొండ పద్మ పాల్గొన్నారు.



కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పాలపొంగళ్లను వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నేటి నుంచి కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. సోమవారం ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయన్నారు. అనంతరం ఉదయం 10.12 గంటలకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముచే కలశస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. కొండలమ్మ అమ్మవారు తొలి రోజున బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు(మోహన్) తెలిపారు.

ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ

గుడివాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఆదివారం ప్లాస్టిక్‌ను నివారిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం అనే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకంతో కేన్సర్ కారణం, ప్లాస్టిక్‌ను నిషేదించి, భూమాతను రక్షించాలని నినాదాలతో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ జరిగింది. తొలుత ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ రవీంద్ర బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు జె.సతీష్‌చంద్ర, కో-ఆర్డినేటర్ జి.జీవన్, గ్రంథాలయాధికారి శరత్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడివాడ రూరల్ : అసాంఘిక కార్యక్రమాలపై గుడివాడ రూరల్ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో డ్రోన్ సర్వైలెన్స్ సహకారంతో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో వారి వద్ద రూ.2,200 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

కార్మికుల పనిగంటలు పెంచడం దారుణం

గుడివాడ : కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల 8 పని గంటల నుంచి 13గంటలకు పెంచడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండ, విజయకుమార్ పాల్గొన్నారు.























బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్ బాలాజీ


యోగా శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కలెక్టర్ బాలాజీ అన్నారు. గొడుగుపేట కన్యకపరమేశ్వరీ సత్రంలో ఆదివారం సత్య సేవ యోగ మండలి ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులను కలెక్టర్ బాలాజీ ప్రారంభించి మాట్లాడారు. సాధకులతో ప్రాణాయామం చేయించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


మండలి వెంకట కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న రామానుజ జీయర్ స్వామి, బుద్ధప్రసాద్ కూటమి నేతలు

నిస్వార్థ సేవకుడు మండలి వెంకట కృష్ణారావు

● అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామీజీ

నాగాయలంక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలందించిన దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు దివిసీమ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉన్నారని అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామిజీ అన్నారు. శత జయంతి 50వ రోజున మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి రామానుజ జీయర్ స్వామి, మండలి బుద్దప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలను నాటారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక సభ జరిగింది. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అధ్యక్షత వహించి దివిసీమ అభివృద్ధికి దివంగత మండలి చేసిన సేవలను గుర్తు చేశారు. అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామిజీ మాట్లాడుతూ, నాయకత్వ లక్షణాలు కలిగి సేవలు చేసిన నేతలే ప్రజల మనస్సులో చిరస్థాయిగా ఉంటారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ ఏడాది పాటు నాగాయలంకలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను చేస్తున్నందుకు నిర్వహణ కమిటీని అభినందించారు. తహసీల్దార్ సిహెచ్.వీ రాంజనేయ ప్రసాద్, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి నాగ మల్లిఖార్జునరావు, మండలి వెంకట్రామ్, తలశిల వెంకట నరసింహారావు, మండలి ఉదయభాస్కర్, భోగాది శివవిష్ణువర్ధన్, బండ్రెడ్డి మల్లిఖార్జున్, హరి, ఉప్పల బసవ శంకరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. వివిధ పోటీలలోని విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

స్ఫూర్తి ప్రదాత ఎంవీకే : డీఆర్కే

అవనిగడ్డ : మండలి వెంకట కృష్ణారావు స్థాపించిన సేవా సేన, సఫాయి సేన దివిసీమ ఉప్పెన అనంతరం చేసిన సేవా కార్యక్రమాలు నేటి స్వచ్ఛతా కార్యక్రమాలకు స్ఫూర్తిగా మారాయని స్వచ్ఛ చల్లపల్లి రథ సారథి డా.డి. ఆర్.కె.ప్రసాద్ అన్నారు. శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పించారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్మాత డాక్టర్ టి.పద్మావతితో చల్లపల్లి స్వచ్ఛ సైనికులతో కలిసి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న డీఆర్కే ప్రసాద్ నాడు మండలి వెంకట కృష్ణారావు రాజకీయాల్లో సేవా నిరతిని తీసుకొచ్చి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. అవనిగడ్డ ప్రాంతంలో 1970, 80వ దశకంలోనే సఫాయి సేన స్థాపించి గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారని డీఆర్కే గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ డీఆర్కే దంపతుల సేవలను కొనియాడారు. మండలి వెంకట్రామ్, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణ, రాచూరి ఉదయ శంకర శాస్త్రి, తూము వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, గాంధీక్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, యలవర్తి చిన్నా, కూటమి నేతలు పాల్గొన్నారు.


మండలి కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న డాక్టర్ డీఆర్కే


విద్యుద్దీపకాంతులతో రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి


పెడన కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దీపకాంతులు


విద్యుత్ దీపాలంకరణలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ఆలయం

దసరాకు ఆలయాల ముస్తాబు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, భాస్కరపురం లోని త్రిశక్తిపీఠం, ఈడేపల్లి జోడుగుళ్లు, శక్తిగుడి, బుట్టాయిపేట దత్తాశ్రమ విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దారు. ఈ ఏడు దేవీ శరన్నవరాత్రోత్సవాలు 11 రోజుల పాటు నిర్వహిస్తున్న దృష్ట్యా వివిధ దేవాలయాల్లో రోజుకొక అలంకారం చొప్పున చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెడన : పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబ యింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాలలో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, తొలి రోజైన సోమవారం అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చిన్నా తెలిపారు. పెడన రూరల్ : మండలంలోని ఆలయాలు శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబయ్యాయి. మడక గంగా పార్వతి సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం గం.8.02ని లకు జోగి ప్రకాశరావు, రజని దంపతులు కలశ స్థాపన చేయనున్నారు. చోడవరం అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, చెన్నూరు గంగా పార్వతి సమేత నారద లింగేశ్వర స్వామి, ఉరివి పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, ఉప్పలకలవగుంట నాగేశ్వరస్వామి, నడుపూరు అగ్రహారం, బల్లిపర్రు, లంకలకలవగుంట, నందిగం శివాలయాలలో 11 రోజులపాటు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. మోపిదేవి : శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి ఆలయం, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, మోపిదేవి సకలేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లో నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోడూరు : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేపథ్యంలో మండలంలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, కోడూరు కనకదుర్గమ్మ, గంగానమ్మఆలయాలను విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. 11 రోజులపాటు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంలో అమ్మవార్లు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 11 రోజులు జానపద నృత్యాలు, కోలాటం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోడూరు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రతిరోజు అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

అమ్మవారిని కొలిచిన వారికి అన్నీ సుఖాలే

మచిలీపట్నం టౌన్, : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని కొలిచిన వారికి అన్ని రంగాల్లోనూ విజయాలు సాధించవచ్చని శివస్వామి అన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో శివస్వామి పాల్గొన్నారు. భక్తుల నుద్దేశించి అభిబాషణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి : హసీంబేగ్


మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో హసీంబేగ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, గోపీచంద్, బాబాప్రసాద్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేద మైనారిటీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు డాక్టర్ హసీంబేగ్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్‌స్టార్ స్కూల్‌లో హసీంబేగ్‌ను ఘనంగా సన్మానించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సన్మానసభలో హసీంబేగ్ మాట్లాడుతూ, పేద ముస్లిం, క్రైస్తవులు, బుద్ధిస్టులు, పారశీకుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ, మచిలీపట్నంలో మైనారిటీ గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, హసీంబేగ్ సేవను గుర్తించి ప్రభుత్వం డైరెక్టర్ పదవి ఇచ్చిందన్నారు. జిల్లా విద్యానిధి కన్వీనర్ శ్రీరామ్, టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, ఉపాధ్యక్షుడు అయ్యప్ప స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ ఆదిత్య, జాయింట్ సెక్రటరీ పి.వి.ఫణికుమార్, కరెడ్ల సుశీల, అజ్మతున్నీసా, నూర్జహాన్, చిట్టికుమారి తదితరులు పాల్గొన్నారు.

యాచకులు, వృద్ధులకు భోజనం ప్యాకెట్లు

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ, పులిగడ్డలతోపాటు పలు చోట్ల యాచకులు, వృద్ధులకు ఆదివారం భోజన ప్యాకెట్లు అందజేశారు. దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ వ్యవస్థాపకులు పోలాబత్తిన బిపిన్ చంద్ర పాల్ జన్మదినం సందర్భంగా ఆయన తండ్రి కోటగిరిలంకకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలాబత్తిన గోపాలం ఆధ్వర్యంలో షిర్డీ అన్నప్రసాద నిర్వాహకులు చిట్టా ప్రసాద్ ద్వారా 40 మంది యాచకులకు, వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పుట్టి శ్రీనివాసరావు, గొరుముచ్చు రవి పాల్గొన్నారు.


పారిశుధ్య సేవలు చేస్తున్న ఎన్నారై మండవ శేషగిరి, రైతునేత సురేంద్రనాథ్ బెనర్జీ, గ్రామస్థులు

వక్కలగడ్డలో స్వచ్ఛ సేవలు

చల్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వక్కలగడ్డ గ్రామంలో అపూర్వమైన వక్కలగడ్డ పేరుతో స్వచ్ఛ కార్యక్రమాలను ప్రారంభించారు. ఎన్నారై మండవ శేషగిరిరావు, రైతునేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచీ గంటన్నర పాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులు, రైతుకూలీలు, మహిళలు, అధికారులు పాల్గొని సేవలందిస్తున్నారు. మహిళామండలి నేతలు మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల రాణీకుమారి, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, సొసైటీ విశ్రాంత సీఈవో అల్లూరి బాబూరావు, పాలడుగు పిచ్చేశ్వరరావు, మల్లుపెద్ది అజయ్, శ్రీధర్ తదితరులు పాల్గొని సేవలందించారు.

264 మందికి ఉచిత వైద్యపరీక్షలు

నాగాయలంక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ, ఒమేగా, అను హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రామానుజ జీయర్ స్వామి, బుద్దప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. 14 మందికి ఆపరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ వైద్య సేవా పథకానికి రిఫర్ చేశారు. డాక్టర్ ఫిలిప్, లక్ష్మి, రమ్య, హరీష్ పరీక్షలు చేయగా, ఎస్.శివశంకర్ పర్యవేక్షించారు. మందులను భోగాది శివవిష్ణువర్ధన్, నబ్బినేని మహేష్ అందించారు.

మెహెర్ సెంటర్‌లో బాలసీతాదేవి సంస్మరణ



చల్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అవతార్ మెహెర్‌బాబా బోధనలను ఆచరించిన ఉత్తమ ఉపాధ్యాయురాలు భట్టిప్రోలు బాలసీతాదేవి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మెహెర్‌బాబా సందేశాలను ప్రజలకు తెలియచేసిన ఆధ్యాత్మికవాది బాలసీతాదేవి ఇటీవల కన్నుమూయగా ఆదివారం బాబాసెంటరులో ప్రత్యేక సహవాస్‌ను, సీతాదేవి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెహెర్‌బాబా, సీతాదేవి చిత్రపటాలకు పూలమాలలువేశారు. సంకీర్తనలు ఆలపించారు. మెహెర్‌బాబా సెంటరు కార్యదర్శి పత్రి రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భట్టిప్రోలు రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, కేశవరావు, చుండూరు మెహర్‌ప్రసాద్, కె.సత్యవతి, కె.సులోచన, ఘంటా వెంకట రామయ్య, పత్రి నరసింహారావు, ఉపాధ్యాయులు మద్దాళి దుర్గాప్రసాద్, పత్రి కేశవరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులచే దుస్తుల పంపిణీ



పెడన, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహాలయ అమావాస్య సందర్భంగా పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం అగ్నిహోత్రం హరికృష్ణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. 200 మందికి చీరె లు, లుంగీలు పంపిణీ చేశారు. 500 మంది పేదలకు అన్నదానం చేశారు. పూర్వ విద్యార్థులు చందన నారాయణరావు, మల్లంపల్లి శ్రీనివాసరావు, సిద్ధినేని భాస్కరరావు, కొల్లూరి నాగభూషణం, జల్లూరి రాధాకృష్ణ, మోగంటి ప్రసాద్, వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ళ ప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల జీవితాలతో జగన్ చెలగాటం : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులకు ఒక పక్క పరీక్షలు జరుగుతుంటే మాజీ సీయం జగన్‌రెడ్డి కళాశాలల వద్ద ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడం అర్థరహితమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ విమర్శించారు. టీడీపీ కార్యాలయం ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, టీడీపీ నాయకులు పుప్పాల ప్రసాద్, పి.వి. ఫణికుమార్, రామస్వామి, అద్దేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో అన్నసమారాధన

పెడన, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పెడన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్ సెంటర్‌లో అన్నసమారాధన నిర్వహించారు. సమితి పెడన శాఖ అధ్యక్షుడు కొత్త తులసీ నాగవెంకట మురళీకృష్ణ, కోశాధికారి పేరిశెట్టి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి ఏలూరు బాల బాలాజీ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మణికంఠ 60 మంది రోగులను పరీక్షించి ఉచితంగా హోమియోమందులను అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, అన్నం సత్యవాణి, దింటకుర్తి జ్యోతి, సువర్చల, కుసుమ, గణపతిలు శిబిరంలో సేవలు అందించారు.

చిట్టూర్పులో ఉచిత కంటి పరీక్షలు

ఘంటసాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టూరులో జిల్లా గ్రంథాలయ సంస్థ, పరుచూరి సేవా సమితి సహకారంతో సాయి దుర్గ ఆప్టికల్స్ వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పూషడపు వెంకట రామారావు, డాక్టర్ పూర్ణ సుజిత్, డాక్టర్ లేఖన 76 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కొడాలి పీఏసీఎస్ ఛైర్మన్‌గుత్తికొండ వరప్రసాద్, చిట్టూర్పు ఉపసర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, చిట్టూర్పు నీటి సంఘం అధ్యక్షుడు దాసరి సతీష్‌బాబు, గ్రంథాలయ అధికారి పరుచూరి శేషగిరిరావు, వార్డు మెంబర్ యలవర్తి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా నాగేశ్వరరావు

పెడన, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెడన జయలక్ష్మి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా సీనియర్ టీడీపీ నేత యర్రపోతు నాగేశ్వరరావు నియమితులయ్యారు. సభ్యులుగా కూనపరెడ్డి రంగనయ్యనాయుడు(జనసేన), బూసం డోలాంబ (టీడీపీ) నియమితులయ్యారు.

ఆదిత్యనాథుని శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం పాకలపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో వెలివెల శ్రీనివాసరావు దంపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 40 జంటలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధర్మకర్తలు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు. తుంగలవారిపాలెంలో అన్నసమారాధన నిర్వహించారు. మత్తి వెంకటేశ్వరరావు, రాజనాల వీరబాబు పాల్గొన్నారు.